సాక్షి
ములుగు

బుధవారం । 21 । ఆగస్టు । 2024



ప్రశ్నించేతత్వంతోనే శాస్త్రీయ అభిరుచి

ప్రశ్నించేతత్వంతోనే శాస్త్రీయ అభిరుచి సాధ్యమని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు.
- 8లో




లక్ష్య సాధకులు..

యూపీఎస్సీ ఫలితాల్లో వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన అన్నదమ్ములు ఆనంద్, సంతోశ్‌లు అద్భుత విజయం సాధించి కేంద్ర ప్రభుత్వ కొలువుకు ఎంపికయ్యారు. - 8లో

గరిష్టం/కనిష్టం
32^0 / 26^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.



ఆర్టీసీకి రాఖీ బొనాంజా

- 19న ఒక్క రోజే 5,58,244 మంది ప్రయాణం
- మహిళా ప్రయాణికులు 3,84,633 మంది
- ఆక్యుపెన్సీ రేషియో 119 శాతం
- వరంగల్ రీజియన్‌లో రాఖీ పండుగకు పోటెత్తిన ప్రయాణికులు

హన్మకొండ: రాఖీ పండుగ ఆర్టీసీకి కాసుల వర్షం కురిపించింది. పండుగ (ఈ నెల 19న) ఒక్కరోజే ప్రయాణికులు అధిక సంఖ్యలో వివిధ రూట్లలో ప్రయాణించారు. సోమవారం ఒక్క రోజే వరంగల్ రీజియన్‌లో 5,58,244 మంది ప్రయాణించారు. ఇందులో 3,84,633 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. చార్జీలు చెల్లించిన ప్రయాణికులు 1,73,611 మంది ఉన్నారు. ఉచితంగా ప్రయాణించిన మహిళలు 69 శాతం ఉండగా, చార్జీలు చెల్లించి ప్రయాణించిన వారు 31 శాతం ఉన్నారు. దీంతో బస్సులన్నీ కిక్కిరిశాయి. సాధారణ రోజుల్లో రోజుకు 3.94 లక్షల మంది వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇంచుమించుగా పండుగ రోజున అంతమంది మహిళా ప్రయాణికులే ఉండడం గమనార్హం. ఆక్యుపెన్సీ రేషియో 119 శాతానికి చేరింది. ఈ ఒక్క రోజు 4.23 లక్షల కిలో మీటర్లు బస్సులు తిరగగా, రూ.3.20 కోట్ల ఆదాయం వచ్చింది. వరంగల్ రీజియన్‌లో సగటున రోజుకు రూ.2.25 కోట్ల ఆదాయం వస్తుంది. పండుగ రోజు అదనంగా రూ.95 లక్షలు వచ్చింది. గత సంవత్సరం రాఖీ పండుగ రోజు 4.19 కిలో మీటర్లు తిరిగిన బస్సులు 98 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో రూ.2.58 కోట్ల ఆదాయాన్ని రాబట్టుకుంది. అదే విధంగా ఈ నెల 17న మొత్తం 4.50 లక్షల మంది ప్రయాణించగా ఇందులో ఉచితంగా ప్రయాణించిన మహిళలు 2.84 లక్షలు, వచ్చిన ఆదాయం రూ.234.97 లక్షలు, 18న 4.33 లక్షల మంది ప్రయాణించగా.. ఇందులో ఉచితంగా ప్రయాణించిన మహిళలు 2.67 లక్షలు, ఆదాయం రూ.245.52 లక్షలు.

- వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో 142 ఆక్యుపెన్సీ రేషియోతో కిలోమీటర్‌కు రూ.86.53 ఆదాయంతో సగటున తొర్రూరు డిపో అగ్రభాగంలో నిలిచింది.
- పరకాల డిపో 136 ఆక్యుపెన్సీ రేషియోతో కిలోమీటర్‌కు రూ.82.11తో ద్వితీయ, భూపాలపల్లి డిపో 131 ఆక్యుపెన్సీ రేషియోతో కిలో మీటర్‌కు రూ.81.69 ఆదాయంతో మూడో స్థానంలో నిలిచింది.



- వరంగల్-2 డిపో 110 ఆక్యుపెన్సీ రేషియోతో కిలోమీటర్‌కు రూ.69.71 ఆదాయంతో చివరి స్థానంలో నిలిచింది.

అవసరం మేరకు బస్సులు నడిపాం..



రాఖీ పండుగకు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా బస్సులు నడిపాం. రాఖీ ముందు రోజుల్లో సెలవులు కలిసి రావడంతో ఆ రోజుల్లో రద్దీ పెరిగింది. అయినా డిమాండ్‌ను బట్టి ఆయా రూట్లలో అదనపు బస్సులు నడిపాం. ఆర్టీసీని ఆదరించిన ప్రయాణికులకు కృతజ్ఞతలు.

– డి.విజయభాను, వరంగల్ ఆర్‌ఎం

న్యూస్‌రీల్

విధులు బహిష్కరించిన జీపీ సిబ్బంది



ఏటూరునాగారం: ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సిబ్బంది 5నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విధులను బహిష్కరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సఫాయి కార్మికులు మాట్లాడుతూ ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకుండా తమతో పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. వేతనాలు అడిగితే రేపు మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారే తప్పా తమ గురించి కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్ పట్టించుకోవడం లేదన్నారు. తమకు వేతనాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు విధులకు రానని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమలో మినాజ్, లాలు, అనిల్, ప్రణయ్, సమ్మక్క, లక్ష్మిలతో పాటు 40మంది సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ జీతాలు చేసి ఎస్‌టీఓకు పంపించామని, ఆర్‌బీఐ దగ్గర పెండింగ్ ఉందని తెలిపారు. సమస్యను కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలిపారు.


కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మౌనదీక్ష



వెంకటాపురం(కె): మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం సంఘం భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధనపనేని వెంకటేశ్వర్లు దంపతులు తమ స్వగృహంలో మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్ నిధులను, కమిటీలను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జనాభాలో 24 శాతంగా ఉన్న మున్నూరు కాపులకు రెండు మంత్రి పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

రోడ్డుకు ఇరువైపులా ఇసుక లారీలు

ట్రాఫిక్‌లో చిక్కుకున్న స్కూల్ బస్సు



వెంకటాపురం(కె): మండల పరిధిలోని పలు చోట్ల ఇసుక లారీలు రోడ్డుపై ఇరువైపులా నిలిపి వేస్తుండడంతో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రామచంద్రపురం సమీపంలో రహదారి గుంతలమయంగా ఉండటంతో మంగళవారం భద్రాచలం నుంచి వెంకటాపురం వచ్చే స్కూల్ బస్సు రహదారిపై ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించారు. గంటకు పైగా ట్రాఫిక్ జామ్‌లో స్కూల్ బస్సు చిక్కడంతో విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆ ప్రాంతానికి చేరుకుని ఇళ్లకు తీసుకెళ్లారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా..

16ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని లిఫ్ట్ ఇరిగేషన్లు

- పట్టించుకోని పాలకులు, అధికారులు
- సాగునీటికి ఇబ్బందులు పడుతున్న గిరిజన రైతులు

మంగపేట: తమ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలకులు పదేళ్ల పాలనలో చెప్పిన నీతి మాటలు ఉపన్యాసాలకే పరిమితం అయ్యాయని గిరిజన రైతులు వాపోతున్నారు. మంగపేట మండలంలోని ఆదివాసీ గిరిజన రైతుల పంట పొలాలకు సాగునీరు అందించేందుకు కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్లు నిర్మాణానికే పరిమితం అయ్యాయి. నిర్మాణం పూర్తయి 16 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థకు చేరి శిలాఫలకాలకు పరిమితమై వెక్కిరిస్తున్నాయి. ఏజెన్సీలోని గిరిజన రైతుల సాగు భూములకు రెండు పంటలకు సరిపడా సాగునీరు అందించి ఆర్థికంగా బలోపేతం చేస్తామని చెప్పిన నాయకుల మాటలు ఆచరణలో కనిపించడం లేదని గిరిజన రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని రామచంద్రునిపేట పంచాయతీ పరిధిలోని 370 ఎకరాల ఆదివాసీ గిరిజనుల భూములకు సాగునీటిని అందించేందుకు కొత్తచీపురు దుబ్బ సమీపం నుంచి జీవనదిలా పారే కప్పవాగుపై నీటి పారుదల శాఖ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ శాఖ ద్వారా రూ.101.58 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు పనులకు 2008లో అప్పటి ఎమ్మెల్యే పొదెం వీరయ్యతో కలిసి నవంబర్ 25న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మైనర్, మేజర్ ఇరిగేషన్ శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పనులను ప్రారంభించారు. అదే విధంగా మండలంలోని మల్లూరు పంచాయతీ పరిధిలోని మొట్లగూడెం వద్ద మల్లూరువాగుపై మరో రూ.101.58 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు పనులకు సైతం శంకుస్థాపన చేశారు. రెండు ప్రాంతాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తయి 16 ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారి వెక్కిరిస్తున్నాయి.

ప్రజాధనం వృథా..

లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టడంతో రెండు పంటలకు సరిపడా సాగునీరు అందుతుందని ఆశపడిన గిరిజన రైతులకు అడియాషలే ఎదురయ్యాయి. గడిచిన 16 ఏళ్లకాలంలో లిఫ్ట్ ఇరిగేషన్ల విషయాన్ని సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకున్న సందర్భాలు లేవు. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా కావడంతో పాటు నిరుపయోగంగా మారాయని గిరిజన రైతులు ఆరోపిస్తున్నారు.



కొట్టుకుపోయిన చెక్‌డ్యాం(ఫైల్)

వరదలతో ఆనవాళ్లు లేకుండా..

పాలకుల పట్టింపులేక, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొత్తచీపురుదుబ్బ వద్ద కప్పవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం వరదల కారణంగా ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయింది. మండలంలోని పాత చీపురుదుబ్బ, కొత్తచీపురుదుబ్బ, సంఘంపల్లి గ్రామాలకు చెందిన సుమారు 5నుంచి 600 ఎకరాల ఆదివాసీ గిరిజన రైతుల భూములకు రెండు పంటలకు సాగునీరు అందించేందుకు దోమెడ అటవీ ప్రాంతంలోని తోగుల ద్వారా వచ్చే నీటితో నిత్యం జీవనదిలా పారే కప్పవాగుపై 1986లో అప్పటికి ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ సీవీఎస్‌కే శర్మ చెక్‌డ్యాం నిర్మించారు. 2001–2002 వరకు ఆయా భూములకు సాగునీరు సమృద్ధిగా అందింది. అనంతరం పరిరక్షణపై ఐటీడీఏ అధికారులు, ఇంజనీరింగ్ శాఖ పట్టించుకోక పోవడంతో గడిచిన 20ఏళ్లలో ప్రతిఏటా వాగు వరద ఉధృతికి కోతకు గురికావడం, లీకేజీలు ఏర్పడటం కారణంగా శిథిలావస్థకు చేరి ప్రస్తుతం ఆనవాళ్లు కూడా లేకుండా కొట్టుకుపోయింది.

మంత్రి సీతక్కపై ఆశలు

నిరుపయోగంగా మారిన లిఫ్ట్ ఇరిగేషన్లు, చెక్‌డ్యాం నిర్మాణంపై పంచాయతీరాజ్, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క దృష్టి సారిస్తే తమ భూములకు సాగునీటి సమస్య తీరుతుందని గిరిజన రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొత్తచీపురుదుబ్బ వద్ద కప్పవాగుపై నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ వినియోగంలోకి తీసుకురావడంతో పాటు కొట్టుకుపోయిన చెక్‌డ్యాం స్థానంలో నూతనంగా నిర్మాణం చేపట్టి మల్లూరువాగుపై నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్లను వినియోగంలోని తీసుకువస్తే సుమారు 2 వేల ఎకరాల భూములకు సాగు నీరు అందే అవకాశం ఉంది. అదే విధంగా మల్లూరువాగుపై నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్‌ను వినియోగంలోకి తీసుకువస్తే సుమారు 500 నుంచి 600 ఎకరాలకు సాగునీటి వసతితో పాటు మల్లూరు అత్తచెరువులోకి మిగులు నీరు వచ్చే అవకాశం ఉంది. మండలంపై పూర్తి అవగాహన ఉన్న మంత్రి సీతక్క ప్రత్యేక చొరవచూపి ఐటీడీఏ, ఇరిగేషన్ అధికారులతో చర్చించి సాగు నీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని కప్పవాగు వద్ద నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్

ప్రభుత్వానికి నివేదిక అందజేశాం..



వాగు వరద కోతకు గురై కొట్టుకుపోయిన కప్పవాగు చెక్‌డ్యాం స్థానంలో నూతన చెక్‌డ్యాం నిర్మాణానికి నివేదిక అందజేశాం. కోటి రూపాయల వ్యయం అంచనాతో ప్రతిపాదనలతో ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

– వలీమ్ మహ్మద్, ఇరిగేషన్ ఏఈఈ, మంగపేట

లక్నవరంలో సౌకర్యాల కల్పనకు కృషి



వంతెనపై మంత్రులు కృష్ణారావు, సీతక్క తదితరులు



సరస్సులో బోటింగ్ చేస్తున్న మంత్రులు, కలెక్టర్

మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు

గోవిందరావుపేట: లక్నవరం వచ్చే పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణరావు అన్నారు. మండల పరిధిలోని లక్నవరం ఐర్లాండ్‌లోని ఉడెన్ కాటేజీలను మంత్రులు మంగళవారం పరిశీలించారు. అనంతరం బోటింగ్ చేశారు. పర్యాటకుల వసతుల గురించి అధికారులు మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్నవరం సరస్సులో పర్యాటకులను ఆకట్టుకునేలా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని, అందుకోసం కలెక్టర్‌ను నివేదిక కోరామన్నారు. నివేదిక వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులు మొదలు చేసే ముందు మరోసారి మంత్రి సీతక్కతో కలిసి లక్నవరంలో పర్యటిస్తామని జూపల్లి అన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ ఎండి. ప్రకాశ్ రెడ్డి, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ కె.సత్యపాల్‌రెడ్డి, కేంద్ర, రాష్ట్ర పరావస్తు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జంగాలపల్లి క్రాస్‌ను జీపీగా గుర్తించాలని వినతి ఇచ్చేందుకు..

ములుగు రూరల్: జంగాలపల్లి క్రాస్‌ను గ్రామ పంచాయతీగా గుర్తించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావులు లక్నవరం వెళ్తున్నారనే విషయం తెలుసుకున్న గ్రామస్తులు వినతిపత్రం అందించేందుకు జాతీయ రహదారిపై ఎదురు చూశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ జంగాలపల్లి క్రాస్ రోడ్డులో ఉన్న ఇళ్లు బంజరుపల్లి, ఇంచర్ల, జంగాపల్లి జీపీలలో ఉండటంతో క్రాస్ రోడ్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై మంత్రులకు వినతిపత్రం ఇచ్చేందుకు ఉండగా పోలీసులు రాష్ట్ర మంత్రులకు వినతిపత్రం ఇవ్వకుండా అడ్డుకున్నారని తెలిపారు. ఈ విషయంపై సీతక్క స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొమ్మగాని రాజు, జినుకల కృష్ణాకర్, రమేష్, జ్యోతి, ప్రశాంత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో నేడు పొట్ట పండుగ

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండల పరిధిలోని మేడారంలో పొట్టపండుగను నేడు సమ్మక్క పూజారులు ఆచార సంప్రదాయంగా ఘనంగా నిర్వహించనున్నారు. మాఘకార్తె సందర్భంగా పూజారులు పొట్టపండుగ నిర్వహించడం ఆనవాయితీ. నేడు(బుధవారం) మేడారంలోని సమ్మక్క గుడిని పూజారులు శుద్ధి చేసి పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. గుడిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు రాత్రి సమయంలో గుడి నుంచి అమ్మవారి రూపంలో పసుపు, కుంకుమలు, పూజ సామగ్రిని తీసుకుని తల్లుల గద్దెలపైకి వెళ్తారు. గద్దెల వద్ద పూజలు నిర్వహించి రాత్రంతా జాగారాలు చేస్తారు. గురువారం ఉదయం పొద్దుపొవడక ముందే తల్లుల గద్దెలపై ఉంచిన పూజ సామగ్రిని తీసుకుని బూర కొమ్ముల శబ్దాల నడుమ సమ్మక్క గుడికి వెళ్తారు. గద్దెల నుంచి గుడికి వచ్చే దారిలో మహిళలు పూజారులకు నీళ్ల ఆరగిస్తారు. అనంతరం పూజారులు కొత్తగా పొట్టకు వచ్చిన ధాన్యాన్ని నైవేద్యంగా తల్లికి సమర్పిస్తారు. కొత్తగా పండిన ధాన్యాన్ని తల్లులకు సమర్పించిన తర్వాతనే స్వీకరిస్తామని పూజారులు తెలిపారు. పొట్ట పండుగ పూజ కార్యక్రమాలు నిర్వహించేందుకు మంగళవారం నుంచే పూజారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



సమ్మక్క గుడి

బీజేపీ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసరావు

మంగపేట: మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన లింగంపెల్లి శ్రీనివాసరావును బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. శ్రీనివాసరావు విద్యార్థి దశ నుంచి ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీ నాయకుడిగా, బిల్ట్ కార్మికుడిగా పనిచేశారని తెలిపారు. ఆయన చేసిన కృషిని గుర్తించిన పార్టీ బీజేపీ జిల్లా కార్యదర్శిగా నిమించినట్లు తెలిపారు.

భారీ వర్షాలపై అప్రమత్తం

- ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లు వర్క్‌షాప్ నిర్వహించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ములుగు: రాబోయే ఐదు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మేరకు మంత్రి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్‌లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన వీసీకి కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిశీలించాలన్నారు. మూడు నెలల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించిన 20లక్షల ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాలలో తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదాపై ఈ నెల 23, 24వ తేదీలలో వర్క్‌షాప్ నిర్వహించాలని సూచించారు. బిల్లు ముసాయిదాలో చేయాల్సిన మార్పులు, సూచనలు రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శికి తెలియజేయాలని తెలిపారు. ఈ వీసీలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ దివాకర, అధికారులు

మహిళా క్లినిక్‌లను వినియోగించుకోవాలి

డీఎంహెచ్‌ఓ అప్పయ్య

వెంకటాపురం(ఎం): జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలలో ప్రతీ మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా క్లినిక్‌లను మహిళలు వినియోగించుకోవాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా క్లినిక్‌ను ఆయన మంగళవారం పరిశీలించి క్లినిక్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి సేవలు అందాయని డాక్టర్ రిషితను ప్రశ్నించారు. 4,180 మహిళలను పరీక్షించి 145 మంది మహిళలను జనరల్ ఆస్పత్రికి సిఫారసు చేసినట్లు ఆమె బదులిచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య క్లినిక్ ద్వారా తమ ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 16,227 మందిని పరీక్షించి మెరుగైన వైద్య సేవలకు 500 మంది మహిళలకు పైగా జిల్లా ఆస్పత్రితో పాటు వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత, స్టాఫ్‌నర్స్ మునమ్మ, ఎల్‌టీ కృష్ణ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గోవిందరావుపేట: ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌ఓ అప్పయ్య అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని పస్రా గ్రామంలో ప్రోగ్రాం ఆఫీసర్ భవ్య శ్రీ, మెడికల్ ఆఫీసర్ మధు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అప్పయ్య హాజరై మాట్లాడారు. పగలు కుట్టే దోమలతో డెంగీ వస్తుందని తెలిపారు. నిల్వ నీటిని మూడు రోజులకు ఒకసారి మార్చుకోవాలని సూచించారు. ఒకవేళ నీటి ఎద్దడి ఉంటే డ్రమ్ములు, గోళాలపైన మూతలు పెట్టుకోవాలన్నారు. అలాగే వాడి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, టైర్లు వంటి వాటిని ధ్వంసం చేయాలన్నారు. దోమ తెరలను విధిగా వాడాలని మలేరియా నుంచి రక్షించుకోవాలని కరపత్రాలు సైతం పంచారు. ఈ కార్యక్రమంలో మలేరియా అసిస్టెంట్ ఆఫీసర్ దుర్గారావు, భూపాల్ రెడ్డి, నరసింహా రావు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



పస్రా సంతలో దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అప్పయ్య

ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సునీల్

ములుగు రూరల్: సేవాలాల్ సేన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పోరిక సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కుమార్ పాడ్యలను నియమించినట్లు సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రంలో నూతన అధ్యక్ష, కార్యదర్శికి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ ఆశయాల మేరకు సమానత్వం, సమన్యాయం, స్వయం పాలన నినాదంతో ముందుకు సాగాలన్నారు. లంబాడీల సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలన్నారు.

ప్రశ్నించే తత్వంతోనే శాస్త్రీయ అభిరుచి

● కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: ప్రశ్నించే తత్వంతోనే శాస్త్రీయ అభిరుచి సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అన్నారు. మంగళవారం కేయూలోని కెమిస్ట్రీ విభాగంలో జనవిజ్ఞానవేదిక, కెమిస్ట్రీ విభాగం సంయుక్తంగా నిర్వహించిన నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ శాస్త్రవేత్తలు నోబెల్ బహుమతికి అర్హులన్నారు. గొప్ప శాస్త్రవేత్తల అనుభవాల నుంచి కొత్త విషయాలు నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. తెలంగాణ జనవిజ్ఞాన వేదిక సెక్రటరీ, విశ్రాంత వరంగల్ నిట్ ఆచార్యుడు కె. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అనేక సమస్యల సమాధానం సైన్స్‌లో ఉందన్నారు. జనవిజ్ఞానవేదిక హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కె. పురుషోత్తం మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత, జీవవైవిధ్యం కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సైన్స్‌విభాగాల డీన్ జి.హనుమంతు మాట్లాడుతూ ఇంకా మూఢనమ్మకాల్లో కొట్టుమిట్టాడుతుంటే వాటినుంచి బయటపడాలంటే సైన్స్ మాత్రమే మార్గం అన్నారు. యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బి. సురేశ్‌లాల్, బీఓఎస్ చైర్మన్ ఎస్.జ్యోతి మాట్లాడారు. ఈసమావేశానికి కెమిస్ట్రీ విభాగం అధిపతి సవితాజ్యోత్స్న అధ్యక్షత వహించి మాట్లాడారు.

రేపు ఫిజికల్ డైరెక్టర్ల సమావేశం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని యూనివర్సిటీ కళాశాలల, అనుబంధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ల సమావేశం గురువారం (ఈనెల 22న) ఉదయం 11గంటలకు క్యాంపస్‌లోని సెనేట్ హాల్‌లో నిర్వహించనున్నట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–2025 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్ కాలేజీయేట్ టోర్నమెంట్స్, వివిధ క్రీడాపోటీల నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చిస్తారని తెలిపారు.



లక్ష్య సాధకులు..

యూపీఎస్సీ ఫలితాల్లో మెరిసిన అన్నదమ్ములు

● కేంద్ర ప్రభుత్వ కొలువులకు ఎంపిక
● ఆదర్శంగా నిలుస్తున్న గిరిపుత్రులు


ఆంగోతు ఆనంద్


ఆంగోతు సంతోశ్

నర్సంపేట : ఆ అన్నదమ్ములు.. ఉన్నత ఉద్యోగం సాధించాలని చిన్నప్పటి నుంచే కలలు కన్నారు. దీనికి ఓ లక్ష్యం విధించుకున్నారు. ఈ మార్గంలో ఎన్నో ఆటంకాలు, ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా తట్టుకుని ప్రణాళిక ప్రకారం చదివి గమ్యం చేరుకున్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షకు అనుగుణంగా యూపీఎస్సీ ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారు ఈ గిరిపుత్రులు. వారే నర్సంపేట పట్టణానికి చెందిన ఆంగోత్ భద్రయ్య –అరుణ దంపతుల కుమారులు సంతోశ్, ఆనంద్. ఇటీవల యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన ఫలితాల్లో సంతోశ్ ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్‌లో మైనింగ్ ఇంజనీర్, ఆనంద్ కేంద్ర కార్మిక శాఖలో లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉద్యోగం సాధించారు. ఒక ఉద్యోగం సాధించడమే కష్టంగా మారిన ప్రస్తుత రోజుల్లో ఉద్యోగం చేస్తూనే మరో ఉద్యోగానికి అదీ జాతీయ స్థాయి ఉద్యోగాలకు సన్నద్ధమై సాధించడం గొప్ప విశేషం.

విద్యాభ్యాసం..

సంతోశ్, ఆనంద్ ఇద్దరూ ప్రాథమిక విద్యను నర్సంపేటలో పూర్తి చేశారు. సంతోశ్ పదో తరగతి హనుమకొండ, ఇంటర్ హైదరాబాద్, కర్ణాటక ఎన్ఐటీలో ఇంజనీరింగ్, జైపూర్‌లో ఎంబీఏ పూర్తి చేశారు. అనంతరం అల్ట్రాటెక్ సిమెంట్స్ (ఆదిత్య బిర్లా)లో ఇంజనీర్‌గా, కొంత కాలం పేటీఎం సంస్థలో, జాతీయ ఖనిజ అభివృద్ధి సంస్థలో రెండు సంవత్సరాల నుంచి పని చేస్తున్నారు. సివిల్స్ లక్ష్యంగా ఆర్‌సీ రెడ్డి కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకున్నారు. ఒక పక్క ఉద్యోగం చేస్తూనే.. మరోపక్క ఖాళీ సమయంలో పోటీ పరీక్షకు సన్నద్ధమై ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్‌లో ఇంజనీర్ కొలువు సాధించారు. ఆనంద్ పదో తరగతి బిట్స్ స్కూల్, ఇంటర్, ఇంజనీరింగ్ హైదరాబాద్, వరంగల్ ఎన్ఐటీలో ఎంబీఏ పూర్తి చేశారు. టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్, ఆ తర్వాత చెన్నై పెట్రోలియం సంస్థలో హెచ్ఆర్ అధికారిగా పని చేస్తూనే యూపీఎస్సీ ద్వారా కార్మిక శాఖలో ఉద్యోగం సాధించాడు.

ప్రణాళిక ప్రకారం చదివి.. లక్ష్యం చేరుకుని..

ఉన్నత చదువులతో జీవితంలో స్థిరపడిన తమ బాబాయ్‌లు, తల్లిదండ్రులను సంతోశ్, ఆనంద్ ఆదర్శంగా తీసుకున్నారు. యూపీఎస్సీలో ఉన్నత ఉద్యోగం సాధించాలని లక్ష్యం విధించుకున్నారు. ఈ నేపథ్యంలో సంతోశ్ రెండు దఫాలు(గ్రూప్–ఏ) ప్రిలిమ్స్, మెయిన్స్ వరకు వెళ్లారు. అయితే ఆ ఫలితాలు నిరాశకు గురిచేశాయి. అయినా ఏమాత్రం నిరుత్సాహ పడకుండా మూడో ప్రయత్నంలో ((గ్రూప్–బీ) గమ్యం చేరుకున్నాడు. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్‌లో మైనింగ్ ఇంజనీర్ కొలువు సాధించాడు. ఇక ఆనంద్ మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించారు. కేంద్ర కార్మిక శాఖలో లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉద్యోగం సాధించారు. ఈ అన్నదమ్ములు సుమారు సంవత్సరం కాలం పుస్తకాలతో దోస్తీ పట్టారు. ఎప్పుడూ చదువు ధ్యాసే. విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని లక్ష్యం చేరుకున్నారు. ఎందరో యువకులకు ఆదర్శంగా నిలిచారు.

కుటుంబ నేపథ్యం..

సంతోశ్, ఆనంద్ తల్లిదండ్రులు ఆంగోత్ భద్రయ్య–అరుణ దంపతులది వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం భోజెర్వు గ్రామం జగ్గుతండా. భద్రయ్య తల్లిదండ్రులు ఆంగోత్ చీమా–మల్కమ్మ. ఈ దంపతులకు నలుగురు కుమారులు భద్రయ్య, తారాసింగ్, మోహన్, విజేందర్ ఉన్నారు. భద్రయ్య టీచర్‌గా, తారాసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుడిగా, మోహన్ పిల్లల వైద్య నిపుణుడిగా, విజేందర్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో తమ తండ్రి తప్ప అందరూ డాక్టరేట్‌లుగా ఉన్న తమ బాబాయ్‌లను స్ఫూర్తిగా తీసుకున్న సంతోశ్, ఆనంద్.. చిన్నప్పటి నుంచే చదువులో రాణిస్తూ వచ్చారు. ఉద్యోగ రీత్యా వీరి కుటుంబం నర్సంపేటలో స్థిరపడింది. సంతోశ్, ఆనంద్ తల్లి అరుణ వైద్య ఆరోగ్యశాఖలో ఎంఎస్‌డబ్ల్యూ గ్రేడ్–1 అధికారి, తండ్రి భద్రయ్య చెన్నారావుపేట మండలం ఎల్లాయిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో హెడ్ మాస్టర్‌గా పని చేస్తున్నారు.


తల్లిదండ్రులు భద్రయ్య-అరుణతో ఆనంద్, సంతోశ్ (ఫైల్)

బాలిక మృతి కేసులో నిందితుడి రిమాండ్

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సురేశ్, పక్కన నర్సింహులపేట ఎస్సై సురేశ్

తొర్రూరు : ఆకతాయి వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ బాలిక.. చికిత్స పొందుతూ ఈ నెల 18వ తేదీన మృతి చెందింది. ఈ ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తొర్రూరు డీఎస్పీ వి. సురేశ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నర్సింహులపేట మండలంలోని ఓ తండాకు చెందిన ఓ బాలిక(17) పాలిటెక్నిక్ డిప్లొమా చదువుతోంది. ఈ క్రమంలో ఖమ్మం చెందిన వంగ సాయి సదరు బాలికను ప్రేమపేరిట వేధింపులకు గురిచేశాడు. దీంతో ఈ వేధింపులు తట్టుకోలేక ఈ నెల 15న బాలిక గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు బాలికను మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నర్సింహులపేట పోలీసులు దర్యాప్తు చేశారు. భరోసా సెంటర్ మహిళా ఎస్సై ఆసుపత్రిలో బాలిక మృతికి ముందు వాంగ్మూలం నమోదు చేశారు. దీని ప్రకారం వంగసాయిని అరెస్ట్ చేసి పోక్సో కేసు, ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో నర్సింహులపేట ఎస్సై మాలోత్ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్ట్

● 19 విద్యుత్ మోటార్లు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

దోర్నకల్ : ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలతోపాటు ఇతర ప్రాంతాల్లో విద్యుత్ మోటార్ల చోరీకి పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను దోర్నకల్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం దోర్నకల్ సీఐ బి.రాజేశ్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీ నిర్వహిస్తుండగా ఓ ట్రాలీ వాహనం పోలీసులను తప్పించుకుని వెళ్లే ప్రయత్నం చేయగా పట్టుకున్నారు. వాహనంలో రెండు విద్యుత్ మోటార్లు, రెండు స్కూటీలు కనిపించడంతో అదుపులోకి విచారణ చేపట్టారు. పదిమంది ముఠా సభ్యులు నాలుగు నెలల నుంచి వివిధ ప్రాంతాల్లో విద్యుత్ మోటార్లు, ఇనుము చోరీ చేస్తున్నట్లు గుర్తించి ఖమ్మంలోని మామిళ్లగూడేనికి చెందిన పాత ఇనుప సామను దుకాణం నిర్వాహకురాలు వీరబోయిన ముత్యాలు, ఇదే ప్రాంతానికి చెందిన డ్రైవర్ కొట్టే గణేశ్, తేజావత్ సుందర్‌లాల్, రఘునాథపాలేనికి చెందిన మొగిలి నాగరాజు, తేజావత్ జోహర్‌లాల్, చంద్రుగొండ మంగీలాల్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం ట్రాలీ వాహనం, రెండు స్కూటీలు, రూ.70 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అంతర్‌జిల్లా ముఠాలోని ఇతర సభ్యులు రఘునాథపాలెం మండలానికి చెందిన శ్రీను అలియాస్ వెంకటేశ్, కొత్తగూడేనికి చెందిన శివతో పాటు ఇద్దరు బాలురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ప్రధాన నిందితురాలు ముత్యాలు ట్రాలీ వాహనాన్ని అద్దెకు తీసుకుని ఇతర నిందితులతో కలిసి ఇప్పటి వరకు 19 విద్యుత్ మోటార్లతో పాటు టన్నున్నర ఇనుము అపహరించినట్లు ఎస్పీ తెలిపారు. డోర్నకల్ మండలంలో ఏడు మోటార్లతో పాటు టన్నున్నర ఇనుము, కురవిలో రెండు, రఘునాథపాలెంలో ఐదు, చింతకానిలో రెండు, నర్సింహులపేట, తల్లాడ, ఖమ్మం రూరల్ మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున విద్యుత్ మోటార్లను చోరీ చేసినట్లు తెలిపారు. ఖమ్మంలో దాచిన మోటార్లను గొల్లచర్ల సమీపంలో దాచేందుకు తరలిస్తూ పోలీసులకు పట్టుబడినట్లు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. సమావేశంలో డీఎస్పీ తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్‌కు ర్యాంకుల పంట

● ఎన్ఐఆర్ఎఫ్–98
● యూనివర్సిటీ విభాగంలో 101–150
● ఓవరాల్ 151–200


వరదారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ దీపక్‌గార్గ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి

హసన్‌పర్తి: కేంద్ర ప్రభుత్వం.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ (ఎన్ఐఆర్ఎఫ్)–2024 విడుదల చేసింది. ఎన్ఐఆర్ఎఫ్‌తో పాటు యూనివర్సిటీ, ఓవరాల్ ర్యాంకులను కూడా ప్రకటించింది. ఈ జాబితాలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలోని ఎస్సార్ యూనివర్సిటీకి చోటు దక్కింది. ఎస్సార్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగంలో జాతీయ స్థాయిలో 98వ ర్యాంకు సాధించినట్లు యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి తెలిపారు. అలాగే, యూనివర్సిటీ విభాగంలో 101–150 ర్యాంకు దక్కించుకుంది. ఓవరాల్ కేటగిరీలో 151–200 ర్యాంకు సాధించినట్లు చాన్స్‌లర్ తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ప్రైవేట్ ఇంజనీరింగ్ సంస్థల్లో ఇంజనీరింగ్ విభాగంలో ర్యాంకు సాధించిన ఏకైక సంస్థ ఎస్సార్ యూనివర్సిటీ అని చెప్పారు. ఎన్ఐఆర్ఎఫ్ విడుదల చేస్తున్న జాబితాల్లో ఇప్పటి వరకు ఎస్సార్ యూనివర్సిటీ 100లోపు ర్యాంకు సాధిస్తూ వస్తోందన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ మాట్లాడుతూ అకడమిక్, ప్లేస్‌మెంట్స్,రీసెర్చ్, ఇన్నోవేషన్‌ల్లో ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధిస్తూ వస్తున్నట్లు వివరించారు. ఈసందర్భంగా ఎస్సార్ చాన్స్‌లర్ ఎ. వరదారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. అర్చనారెడ్డి, డాక్టర్ మహేశ్, డాక్టర్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు..

● ముగ్గురి అరెస్ట్.. ఒకరు పరారీ
● రూ. 7.35 లక్షలు, మూడు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ కిరణ్ కుమార్

నర్సంపేట రూరల్: జిల్లా ఆస్పత్రిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి డబ్బులు వసూలు చేసిన ముఠాను అరెస్ట్ చేసినట్లు నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. నవోదయ ఏజెన్సీ ద్వారా ప్రభుత్వం నర్సంపేట జిల్లా ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో కొత్తగా ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇదే అదునుగా భావించిన ఓ ముఠా.. నవోదయ ఏజెన్సీ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి డబ్బులు వసూలు చేస్తోంది. ఈ క్రమంలో ఈనెల 16వ తేదీన నాంచారి కుమారస్వామి అనే వ్యక్తి తన ఉద్యోగం కోసం ముఠా సభ్యులకు రూ. 10వేలు ఇచ్చాడు. ఈ విషయం తెలియడంతో హనుమకొండకు చెందిన నవోదయ ఏజెన్సీ బాధ్యురాలు పిండి స్వప్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో నర్సంపేటలో ప్రారంభించబోయే జిల్లా ఆస్పత్రి, మెడికల్ కళాశాల వద్ద ఈనెల 20న ముగ్గురు వ్యక్తులు కారులో అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా 17 మంది మంది వద్ద రూ. 7.35 లక్షలు వసూలు చేసినట్లు అంగీకరించారు. దీంతో వారి వద్ద ఉన్న మూడు సెల్‌ఫోన్లు, ఓ కారును స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నలుగురిలో ముగ్గురిని అరెస్ట్ చేయగా మరొకరు పరారీలో ఉన్నారు. అరెస్ట్ అయిన వారిలో హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన పోరండ్ల శివ, నర్సంపేట మండలం ఇప్పల్‌తండాకు చెందిన ధారావత్ శరత్‌చంద్ర, సంగెం మండలం గవిచర్లకు చెందిన శ్రీసాయి కోస్టల్ మాన్ పవర్ సప్లయిర్ ఏజెన్సీ బాధ్యుడు ఎండీ ఖాజామోయినోద్దీన్‌ను అరెస్ట్ చేయగా, వరంగల్ దేశాయిపేటకు చెందిన అకినపెల్లి కవిత పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. ఈసందర్భంగా సీఐ రమణామూర్తి, సిబ్బంది బాబు, రాఘవులు, రవి, కృష్ణ, తానీషా, మాన్‌సింగ్‌ను ఏసీపీ కిరణ్ కుమార్ అభినందించారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

● రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


రామప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రులు కృష్ణారావు, సీతక్క

వెంకటాపురం(ఎం): పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని రామప్ప దేవాలయాన్ని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, భూపాలపల్లి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, నాగరాజుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరస్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు విలేకరులతో మాట్లాడుతూ రానున్న రోజుల్లో ములుగు జిల్లా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. 800 సంవత్సరాల క్రితం కాకతీయులు నిర్మించిన రామప్ప ఆలయం నేటికి చెక్కు చెదరలేదన్నారు. ప్రతి నెల ఎమ్మెల్యేలు, మంత్రులు పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తే మానసిక ప్రశాంత కలుగుతుందన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ లక్నవరంలో ఏర్పాటు చేసిన ఉయ్యాల వంతెన తరహాలో రామప్పలో కూడా ఏర్పాటు చేయాలని మంత్రి కృష్ణారావును కోరారు. పర్యాటకులకు అన్ని వసతులు కల్పించి రామప్ప రిజర్వాయర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఎండీ ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ శబరీశ్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

భార్య మరణం తట్టుకోలేక.. భర్త మృతి

● మనుగొండలో ఘటన


లలిత, కుమారస్వామి(ఫైల్)

గీసుకొండ: కలకాలం తనకు తోడుగా ఉంటానని పెళ్లిలో వేద మంత్రాల సాక్షిగా ప్రమాణం చేసిన భార్య అర్ధాంతరంగా తనువు చాలించింది. దీంతో ఆ బాధ తట్టుకోలేక భర్త మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మనుగొండలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తుప్పరి లలిత(49), కుమారస్వామి(56) దంపతులు జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. ఈ క్రమంలో లలిత ఇటీవల బాత్ రూంలో కాలు జారి పడి తీవ్రంగా గాయపడింది. ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం కన్నుమూసింది. తన భార్య మృతి తట్టులేని కుమారస్వామి మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. ఈ దంపతుల మృతి మనుగొండలో విషాదం నింపింది. కాంగ్రెస్ నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ. 10 వేల ఆర్థిక సాయం పంపించగా కాంగ్రెస్ నాయకులు అల్లం మల్లారెడ్డి, కొమ్ము శ్రీకాంత్, కూసమల్ల అనిల్, ఎంబాడి పరమేశ్వర్ తదితరులు మృతుల కుటుంబ సభ్యులకు అందించారు.

వదిన మృతదేహాన్ని చూసి ఆడబిడ్డ..


కూసం సరోజన(ఫైల్)


తొర్రూరు అమృతమ్మ(ఫైల్)

దుగ్గొండి: వదిన మృతదేహాన్ని చూసి గుండెపోటుతో ఆడబిడ్డ మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని గుడ్డేలుగులపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన తొర్రూరు అమృతమ్మ (72) సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ మేరకు ఆత్మకూరు మండలం మహ్మద్‌గౌస్‌పల్లి గ్రామానికి చెందిన ఆమె ఆడబిడ్డ కూసం సరోజన (62) వదిన అంత్యక్రియల కోసం మంగళవారం గుడ్డేలుగులపల్లికి వచ్చింది. ఉదయం 11 గంటలకు సరోజన.. వదిన మృతదేహాన్ని చూసి ఐదు నిమిషాల పాటు బోరున విలపించింది. ఆ వెంటనే గుండెనొప్పితో ఆమె కుప్పకూలింది. ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందింది. కొన్ని గంటల వ్యవధిలోనే వదిన, ఆడబిడ్డ ఇద్దరు మృతి చెందడంతో గుడ్డేలుగులపల్లి, మహ్మద్‌గౌస్‌పల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జ్వరంతో మహిళ మృతి

● గుడితండాలో ఘటన


శిరీష(ఫైల్)

కేసముద్రం: జ్వరంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం మండలంలోని బోడమంచ్యా తండాజీపీ శివారు గుడితండాలో చోటుచేసుకుంది. తండావాసుల ప్రకారం.. తండాకు చెందిన బోడ శిరీష(30), బాలు దంపతులకు కుమార్తె హారిక, కుమారుడు గణేశ్ ఉన్నారు. శిరీషకు వారం క్రితం జ్వరం రావడంతో మొదట ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకుంది. ఆ తర్వాత కూడా తగ్గకపోవడంతో మానుకోటలోని ఓ ఆసుపత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈనెల 18న హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా మంగళవారం మృతి చెందింది. డెంగీ లక్షణాలతో మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు.

రూ.30 లక్షలు తీసుకుని చంపారు

● మాజీ సర్పంచ్ హత్య కేసులో సుపారీ గ్యాంగ్ అరెస్ట్
● వివరాలు వెల్లడించిన వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య


సుపారీ గ్యాంగ్ అరెస్ట్ చూపుతున్న ఏసీపీ నర్సయ్య, పోలీసు అధికారులు

వర్ధన్నపేట: రూ. 30 లక్షల డీల్ కుదుర్చుకుని మాజీ సర్పంచ్‌ను హత్య చేసిన సుపారీ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపారు. ఈమేరకు తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుపారీ గ్యాంగ్ అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురహాన్‌పల్లిలో జూన్ 7వ తేదీన మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ హత్య కేసులో పోలీసులు ఇప్పటికే నలుగురిని అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. ఈ హత్యకు కారణమైన ఏ–1 పల్లె మురళిని విచారించగా గ్రామానికి చెందిన పల్లె ముకేశ్‌తో సాయంతో సుపారీ గ్యాంగ్ ఏర్పాటు చేసి మాజీ సర్పంచ్‌ను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. ఏపీలోని ప్రకాశం జిల్లా రాచర్ల మండలం గిద్దలూరుకు చెందిన సుంకర ప్రసాద్‌రెడ్డి, రాయపర్తి మండలం బురహాన్‌పల్లికి చెందిన పల్లె ముకేశ్, హైదరాబాద్‌లోని కాప్రా మండలం జవహర్‌నగర్‌కు చెందిన మార్నేని రాజు, నారాయణపేట మండలం ఆభంగపూర్‌కు చెందిన కర్నోల్ల కృష్ణయ్య.. సుపారీ తీసుకుని మాజీ సర్పంచ్‌ను హత్య చేసినట్లు మురళి తెలిపారు. ఈ క్రమంలో ఈ నలుగురు మంగళవారం ఖమ్మం జైలులో ఉన్న మురళితో ములాఖత్‌లో కావడానికి కారులో వెళ్తుండగా రాయపర్తి మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం వద్ద పోలీసులు అరెస్ట్ చేసి కారును స్వాధీనం చేసుకుని విచారించగా నేరం అంగీకరించారు. మాజీ సర్పంచ్ హత్యకు రూ. 30లక్షలు డీల్ కుదుర్చుకుని పథకం ప్రకారం రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా పరిచయం చేసుకుని దేవేందర్‌ను నమ్మించారు. అనంతరం పల్లె మురళి, పల్లె ముకేశ్‌తో పాటు ఈ నలుగురు దేవేందర్‌ను హత్య చేశారు. కాగా, ఇప్పటి వరకు రూ. 14 లక్షలు ఇచ్చారని, మిగతా డబ్బులు తర్వాత ఇస్తామని డీల్ నిర్వాహకులు తెలిపారని ఏసీపీ నర్సయ్య వెల్లడించారు. ఈ సమావేశంలో సీఐ సూర్య ప్రకాశ్, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సుపారీ గ్యాంగ్ పై పలు కేసులు

సుంకర ప్రసాద్ రెడ్డి, మార్నేని రాజు గతంలో చాలా నేరాల్లో ఉన్నారు. ఇప్పటికే సుంకర ప్రసాద్ రెడ్డిపై మూడు హత్య కేసులు, మహబూబ్‌నగర్, కర్నూల్, కడప జిల్లాల్లో 10 వరకు నకిలీ నక్సలైట్ కేసులు, గంజాయి కేసు, అనంతపురం జిల్లా గుంతకల్లు రూరల్ పీఎస్‌లో రెండు కిడ్నాప్ కేసులు, 10 వరకు చోరీ కేసులతోపాటు మరికొన్ని క్రిమినల్ కేసులు ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా మార్నేని రాజుపై నల్లగొండ రూరల్, సదాశివపేట, చిన్న కోడూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు హత్య కేసులు, కిడ్నాప్ కేసులు, హైదరాబాద్‌లో 10 వరకు చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.